# తరువాత?

శ్రీ చిలుకూరి నారాయణరావు

ఉత్తరక్షణములో ఎవరి కేమి జరుగుతుందో ఎవరు చెప్పగలరు?

ఇది ఒక మెట్టవేదాంతపు మాట అని అనుకొనే వాడను. ముందు రాబోయే విషయాలు మన యిచ్ఛాధీనము లనుకొనేవాడను. "ఏమే మీదినము, రేపు, నెల్లాళ్లయినతరువాత, కొన్నియేళ్లు గడచినవెనుక, ఈయీ పనులు చేస్తాము" అని చాలామంది అనడమూ, నేను కూడా అనుకొనడమూ సాధారణముగా జరుగుతూనే ఉన్నది.

కాని, మనుష్యుల ఊహలు ఉత్త ఊహలే. ఒకప్పు డూహాలు కొంతవరకు కార్యరూపములో నెరవేరినట్లే భాసించడమూ, ఇసుకపునాదులమీద కట్టిన గృహములవలె ఆ ఆకాశహర్మ్యములు కూలిపోవడమూ, తరతరములుగా అనాదిగా అనుభవించినవారు చెప్పే విషయమే. అయినా, మానవుడు స్వశక్తిని నమ్ముకొంటూనే ఉన్నాడు. పరశక్తిని విస్మరిస్తూనేఉన్నాడు.

అట్లా చేయకపోతే జీవయాత్ర సాగదు. జగల్లీల విస్తరిల్లదు.

దీనినే మోహ మంటారు కొందరు; మాయ అంటారు మరికొందరు.

ఇది మోహమూ కాదు, మాయా కాదు; ఇదీ సత్యమే, అదీ సత్యమే అంటారు ఇంకా మరికొందరు.

సత్యమయిన దొక్కటే; తక్కిన దంతా అసత్యమే అని ఇంకాకొందరు.

సత్యపదార్థమే లేదనేవారుకూడా ఉన్నారు.

ఏమి టీగొడవంతా?

పుట్టుక ఏమిటి? చావేమిటి?

ఎందుకు పుట్టుతాము? ఎందుకు చస్తాము?

పుట్టేవా డెవడు? చచ్చేవా డెవడు?

పుట్టించేవా డెవడు? చంపేవా డెవడు?

పుట్టించడ మెందుకు? చంపడ మెందుకు?

అసలు పుట్టించేవా డున్నాడా?

పుట్టించేవాడే చంపేవాడుకూడానా?

లేక, వారు వేరా?

"ఓయీ, వెర్రివేదాంతీ! చాలించవోయ్. పుట్టినవాళ్లు పుట్టుతారు; బ్రతికినవాళ్లు బ్రతుకుతారు; చచ్చేవాళ్లు చస్తారు. వాళ్లతో నీకేమిపని? నీపనేదో నీవు చూచుకో. నీధర్మ మేదో నీవు నిర్వర్తించుకో" అని ఎవరో ఉద్బోధిస్తున్నారు.

నాకు పని ఏముంది?

నాకు ధర్మ మే ముంది?

ఆపని నేను కల్పించుకొన్న దే కదా!

మరెవ్వరయినా నాకోసము కల్పించినారా?

ఆ ధర్మమును నా కెవరు నిర్ణయించినారు?

ఒకరు నిర్ణయించినదానిని నే నెందుకు నిర్వర్తించవలెను?

లేక, ఆధర్మముకూడా నేను కల్పించుకొన్నదేనా?

పనులను, ధర్మములను నేను నిర్ణయించుకొనడ మెందుకు?

వాటి నాచరింపలేక కష్ట మనుభవించడ మెందుకు?

ఆచరింపలేనని ఒకరిచేత నిందను పొందడ మెందుకు?

నాపనిని నేను చేసుకొంటే ఎవరికి మేలు?

నాపనిని నేను చేసుకోకపోతే ఎవరికి కీడు?

నాధర్మమును నే నాచరిస్తే లోకోద్ధార మవుతుందా?

ఏమో!

అవుతుం దంటారు కొందరు. ఆచరించేవాళ్లు మాత్రము క్వచిత్తుగా కనబడుతారు.

వారయినా డంబముకోస మాచరిస్తారేమో!

ఏమో? ఒకరి ఊసు నాకేల?

*　　*　　*

సరే! నాపనిని నేను చేస్తాను; నాధర్మమును నేను నిర్వర్తిస్తాను.

తరువాత?

"తరువాత?" అని ప్రతిధ్వని వస్తున్నది. ప్రత్యుత్తరము వినబడదు.

తరువాత? — నిశ్శబ్దము.

***

వాజశ్రవసుడు విశ్వజిద్యజ్ఞము చేస్తున్నాడు. నీరుగాని, గడ్డిగాని లేని బక్క ఆవులను దానముచేస్తున్నాడు.

కొడుకు నచికేతుడు చూచినాడు. "అయ్యో, ఇట్టి ఆవులను దానముచేసి నాతండ్రి సౌఖ్యములేని లోకములకు పోతాడే!" అని వగచినాడు. "తండ్రీ! న న్నెవరి కిస్తా" వన్నాడు. తండ్రికి కోపము వచ్చింది. "నిన్ను మృత్యువు కిస్తానురా!" అన్నాడు.

నచికేతుడు:

"నాకు ముం దెందఱో పోయినారు; నాకు
వెనుక నింకెందరో యట్లె వెడలఁగలరు.
యముని కే నెట్లు పచరింతు? అతఁడు నాకు
నేమి చేయంగఁగలవాఁడు నిపుడు తండ్రి!
పూర్వులందఱు నెట్టులు పోయినారొ
వరుసఁ బోయిరి తరువాతివారుఁ గూడ;
సస్యజాలంబువలెఁ జచ్చి, సస్యమువలె
మరల జనియించుచుండును మర్త్యుఁడెపుడు"

అన్నాడు.

(ఇది కథ. నచికేతుని కట్లు తెలిసింది "సస్యజాలమువలెఁ జచ్చి సస్యమువలె మరల తానున్ను జన్మమెత్తుతా" డని?)

సరే. నచికేతుడు మృత్యువుఇల్లు ప్రవేశించినాడు. అక్కడ మూడురాత్రు లుపవసించినాడు. బ్రాహ్మణు డిట్లుపవసించడము తన కనర్థహేతు వని మృత్యువు భయపడి, "అయ్యా! బ్రాహ్మణా! దయచేసి ఉపవాసము మాను. నీకు కావలసినవి మూడు వరములు తప్పకుండా ఇస్తా" నన్నాడు.

"నీవు నన్ను విడిచిపెట్టు. నాతండ్రివద్దకు పంపు. అతడు నన్ను పోల్చుకొని తన కొడుకుగా పరిగ్రహించనీ" అని మొదటివరము కోరుకొన్నాడు నచికేతుడు.

మృత్యు వావర మిచ్చినాడు.

"నాచికేతాగ్నిని గురించిన జ్ఞానము చాలా గొప్పదట. దాని నుపదేశింపు" మన్నాడు నచికేతుడు రెండోవరముగా.

ఆ వరముకూడా ఇచ్చినాడు మృత్యువు. మూడోవరము కోరుకో మన్నాడు.

నచికేతుడు:

"మనుజుఁడు గతింప నాత్మయు మరల నుండు
ననుచుఁ గొందఱు; ఉండదటంచుఁ గొంద
ఱందు; రీసందియము నెల్ల, అయ్యా! నీవ
తీర్పవలయు; నిదియె నాతృతీయవరము"

అన్నాడు.

మృత్యువుకు గుండెలో గుభిలుమన్నది. "మహాత్మా! మరి యేమయినా అడుగుగాని ఇదిమాత్ర మడుగవద్దు. దేవతలకుకూడా ఇటువంటి సందేహమే కలిగింది. వారికికూడా దీని రహస్యము తెలియలేదు. నీకు సమస్తభాగ్యభోగ్యములను ఇస్తాను. సంతుష్టిపడు" అన్నాడు.

"నా కవేవీ వద్దు. ఇదే కావా" లని హఠము పట్టినాడు నచికేతుడు.

అప్పుడు మృత్యువు నచికేతునికి ఆత్మజ్ఞానముపదేశించినాడు. అదంతా ఇక్కడ వివరించనక్కరలేదు. కఠోపనిషత్తు చదువుకొంటే తెలుస్తుంది.

ఆత్మ నిత్యుడు. అతడమృతస్వరూపి. అతనికి మృత్యువు లేదు. సకలదేహములలోను వర్తించి, వానిని చైతన్యసహితములుగా చేసేవాడతడే. ఆయాజీవులు తాము చేసుకొన్న కర్మముల ననుసరించి ఆయా యోనులలో జన్మమెత్తుతూ ఉంటారు. ఆత్మజ్ఞానము కలుగగానే జన్మరాహిత్యము కలుగుతుంది. అందుచేత మృత్యురాహిత్యమున్నూ కలుగుతుంది. కాబట్టి ఆత్మజ్ఞానలబ్ధికోసము ప్రయత్నము చేయవలెను.

***

నచికేతునికి సందేహము తీరినది. కాని, నాకు తీరలేదు. ఎట్లు తీరుతుంది? నేను నచికేతుడనైతే కదా? మృత్యువు సిద్ధవిషయమే కదా. ఏమిటా మృత్యువు—ఏమిటా మృత్యువు? మృత్యువు చెప్పలేదు; నచికేతుడు తెలుసుకొననూ లేదు. ఈ సనాతనప్రశ్నకింకా ఎవ్వరున్నూ సమాధానము చెప్పలేదు.

*   *   *

సరే! నిలువుగ్రుడ్లు పడుతవి, లేదా కన్నులు మూతలుపడతవి. దౌడలు దగ్గరకు కఱచుకపోతవి. వాతపిత్తకఫములు ప్రకోపిస్తవి. గుండె కొట్టుకొనడము మానివేస్తుంది. శరీర మంతా చల్లబడి కొయ్యబారిపోతుంది. ఇదే మృత్యువు అంటారేమో. కాని ఈ అవస్థ మృత్యువుకు బయటిచిహ్నమవుతుంది గాని, అసలు మృత్యువంటే ఏమిటి? .........ఏమిటి? ... ... ఏమో!

*   *   *   *

శరీరమునకే మృత్యువు; ఆత్మకు కాదు. ఆత్మ శరీరములో చేరి సుఖదుఃఖముల ననుభవిస్తూ ఉంటుంది. ఎందుచేత? అజ్ఞానముచేత అంటారు. ఆత్మకజ్ఞానమేమిటి? అజ్ఞానము భ్రమమూలముగా కలుగుతుందంటారా? ఆభ్రమ ఎందుకు కలుగవలెను? తాను చేసుకొన్న కర్మవల్లనా? కర్మ ఎందుకు చేయవలెను? అట్లా ఇష్టమయినదా? కానీ, ఆత్మకర్మానికి మనమేమిచేస్తాము? ఆత్మమాత్ర మేమి చేయగలదు (డు)?

*   *   *

సరే! మృత్యువు సిద్ధము. తరువాత?—

స్వర్గ మంటారు, నరక మంటారు — కొంత కాలమువరకు. తరువాత జన్మము—పూర్వజన్మపరంపరా కర్మానుసారముగా. నిజమేనా? 'నిజమే, నమ్మ' అంటున్నవి శాస్త్రాలన్నీ. కాని, చచ్చి ఎవ్వడున్నూ తిరిగిరాలేదు, మనకు చెప్పడానికి. పునర్జన్మము కాగానే పూర్వజన్మజ్ఞానము మరపునకు వస్తుంది.

పూర్వజన్మజ్ఞానము కలవారు కొంతమంది మహాత్ములున్నారట. ఉండవచ్చును. నమ్మి సంచరించుకోవలసినది తప్ప అంధకారములో నిదకులాడుతూ ఉన్న నాబోటి సామాన్యనరులకు దిక్కేమున్నది?

***

మొన్న జనవరి మూడో తేదీనుంచి ఏడో తేదీ వరకు చెన్నపట్టణములో పనిమీద నిలువవలసి వచ్చినది. నేను లేనప్పుడు నాభార్యకు గొప్పగండము గడచినది. ఏడో తేదీ ఉదయము ఇల్లుచేరుకొన్నాను. ఆమె స్వస్థముగానే ఉన్నది. ఇద్దరమున్నూ అర్ధగంటసేపు మాట్లాడుకొన్నాము. దేవుడు మాపాల నున్నాడని సంతోషించినాము. కాని ఆ సంతోషము ఆ అర్ధగంటమాత్రమే.

నేను కాలేజీకి పోదామని ఒక అడుగు ఇంటిలోనుంచి బయటికి పెట్టినాను. లోపలినుంచి పెద్ద కేక వినబడ్డది! "ఏమది?" అని లోనికి పోయినాను. నా భార్య "నేను వెళ్లుతున్నాను. పిల్లలను చూచుకోండి" అని ఊరకొన్నది. నాకళ్లయెదుట పెద్దజ్యోతిస్సు కనబడినది.

ముప్పైయేండ్లుగా కలిసి ఈడ్చిన ఈమహాసంసారరథము; ఒంటిగుర్రము మీడ్వగలదా?

ఒక్క నిమిషము. తుదిలకుణా లన్నీ వచ్చినవి. కదిలించినా స్మృతిలేదు; సూదితో గ్రుచ్చినా స్మృతి లేదు.

ఆసుపత్రికి మేఘాలమీద తీసుకొని వెళ్లినాను. సర్జను చూచి పెదవి విరిచినాడు. కొార్యము లేద న్నాడు. ఒకటో, రెండో నిమిషము లన్నాడు.

ఒకటి,......రెండు నిమిషములలో ఏమిచేయ గలిగితే అది చేయం డన్నాను.

నా ధైర్యము చూచి ఆయనకున్న ధైర్యము వచ్చినది.

చికిత్స చేసినాడు. అయిదుగంటలకాల మట్లే ఉన్నది; అప్పటికి కంటిరెప్పలు కదలినవి. ఆశ .....

(ఇప్పుడామెకు బాగున్నది. క్షమించాలి. స్వవిషయము గనుక.)

ఇంటికి వచ్చినతరువాత నవ్వుతాలుగా అడిగి నాను: "నీకు స్మృతిలేనట్టు మాకు కనబడిన నీ అవస్థలో నీ కేమి కనబడినది?" అని.

"నా కేమిన్ని కనబడలేదు."

"ప్రయత్నం చేసి జ్ఞాపకం తెచ్చుకో."

"ఊహూ! ఏమిన్ని కనబడలేదు."

"పురాణాలలోను, శాస్త్రాలలోను ఏమేమో చెప్తారే!"

"అవి నిజము కావచ్చును, నా కేమీ కనబడ లేదు."

"గట్టిగా ప్రయత్నము చెయ్యి."

చిరునవ్వు నవ్వింది. "ఆ తరువాత ఏముందో తెలుస్తే ఇంకేమున్నది?" అన్నది.

నావంటిదే ఆ పెర్రివేదాంతి!

*　　*　　*

ఆమెకు స్మృతితప్పిపోతున్నప్పుడు నాకు కన బడిన ఆజ్యోతి ఏమిటి? శారీరకవికారమా? అయితే అటువంటి మెరపే నామనసు కుదుటపడిఉన్న ఇప్పుడు కూడా అప్పుడప్పు డెందుకు నాకళ్లలో మెరుస్తుంది?

బ్రదుకుచావులమధ్య ఒక నల్లనితెర. అంధ కారముకంటె గాఢాంధకారము. తెర కీవల మన లోకములో వెలుతురు; ఆతెరచాయ లీవెలుతురులో మిళితము లౌతూఉంటవి. తెరఆవల మహాతేజస్సు; ఆతేజస్సుకు ఈ చర్మచక్షువులు తాళలేవు.

ఆతెరను చీల్చుకొని ఆవలిజ్యోతిలో కలిసి పోవడానికి ఆమెఆత్మ ప్రయత్నించింది. ఆసందులో నుంచి ఒక్కకిరణము నాయెదుట మెరసింది. ఇది భ్రమ కాదనుకొంటున్నాను. ఆమె ఆవలికి పోకుండా తెర మూతపడినది.

*　　*　　*

మళ్లీ సంసారము. కామము — క్రోధము — మోహము — లోభము — మదము — మాత్సర్యము, జీవితనాట్యము—జగల్లీల. అదే ఈశ్వరలీల.

